## క్లుప్తంగా

### మాజీ ఎమ్మెల్యే తల్లికి అస్వస్థత

- హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించిన భూమన, సిపాయి తదితరులు



పరామర్శిస్తున్న భూమన తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 'అన్నదాత పోరు' నిరసన ర్యాలీగా బయలుదేరుతున్న సమయంలో శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి తల్లి ఇంట్లో అపస్మారక స్థితిలోకి జారుకున్నారు. హుటాహుటిన ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రక్తపోటు పడిపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారని గుర్తించిన వైద్యులు చికిత్స చేశారు. ఇది తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, సత్యవేడు సమన్వయకర్త రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ అనంతరం హాస్పిటల్‌కు వెళ్లి మాజీ ఎమ్మెల్యే తల్లిని పరామర్శించారు. ఆమె ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. రాత్రి ఆమె ఆరోగ్యం కుదుటపడడంతో డిశ్చార్జి చేశారు.

### నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న నాగలక్ష్మి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం కావలికి చెందిన కొండపి నాగలక్ష్మి రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### రైతులు ఫొటో, ఆధార్ ఇవ్వాలి

బుచ్చినాయుడుకండ్రిగ: చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో అకౌంట్ ఉన్న ప్రతి రైతు ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డు జెరాక్స్‌ను స్థానిక సొసైటీ కార్యాలయంలో ఇవ్వాలని సీఈఓ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా కార్యాలయంలోని కొన్ని పత్రాలలో సంతకాలు కూడా చేయాలన్నారు.

### బాలికల హైస్కూల్లో 'మిషన్ శక్తి సంకల్ప'



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కృష్ణవేణి

రేణిగుంట: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు సీడీపీఓ కృష్ణవేణి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, బాలికలు ఆకర్షణలకు గురికాకుండా టీచర్లు, తల్లిదండ్రుల మాటల్ని పాటించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోషకాహారం బాగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్యామల, సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనమ్మ, అంబిక, పవిత్ర పాల్గొన్నారు.

### మట్టి నమూనా సేకరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూల్లో మంగళవారం పీఎంఆర్‌కేవీవై పథకంలో భాగంగా తిరుపతి సాయిల్ టెస్టింగ్ లేబొరేటరీకి చెందిన వ్యవసాయ అధికారి పుష్పాంజలి 8, 9, ఇంటర్ విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు మట్టి నమూనాలు తీసే పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనివాసులు, షణ్ముగం, ల్యాబ్ టెక్నీషియన్ ప్రియాంక, బీటీఎం శైలజ, ఏఈఓ రేవతి, ఉపాధ్యాయులు ధనుంజయులు, సుబ్బారావు పాల్గొన్నారు.

### ఆదాని స్మార్ట్ మీటర్లు వద్దు

శ్రీకాళహస్తి: సామాన్య ప్రజలపై ఆదాని స్మార్టు మీటర్ల భారం వద్దని సాధారణ మీటర్లే చాలని తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాల గురవం బాబు, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఏడీ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం ఇచ్చి సమస్యలు వారు మాట్లాడారు. ట్రాన్స్‌కో శాఖ స్మార్ట్ మీటర్ల పేరుతో కొన్ని కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసేలా పేద ప్రజలపై ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. ట్రూ అప్ చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. నాయకులు సురేంద్ర రెడ్డి, నవీన్, అంటోని, ఆసిఫ్, నగేష్, నాగరాజు, తేజ పాల్గొన్నారు.

# రైతులను ముంచుతున్న బాబు





అధికారులకు వినతిపత్రం ఇస్తున్న భూమన కరుణాకరరెడ్డి, సిపాయి సుబ్రమణ్యం తదితరులు, అన్నదాత పోరు నిరసన ర్యాలీలో సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు

- రైతులకు యూరియా ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు అమ్ముకుంటున్న టీడీపీ, జనసేన నేతలు
- రైతును రాజు చేస్తానని నట్టేట ముంచుతున్న సీఎం
- 'అన్నదాత పోరు'లో భూమన కరుణాకరరెడ్డి విమర్శ
- రైతుల సమస్యలు తీర్చాలని ఆర్డీఓ కార్యాలయంలో వినతి



మీడియాతో మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

శ్రీకాళహస్తి: ఎరువుల కొరత, బ్లాక్ మార్కెట్‌లో యూరియా విక్రయంపై రైతన్నలు కన్నెర్ర చేశారు. వైఎస్సార్ సీపీ నిర్వహించిన »అన్నదాత పోరు«లో కూటమి ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు పడుతున్న ఇక్కట్లపై మంగళవారం శ్రీకాళహస్తిలో అన్నదాత పోరు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు సమన్వయకర్త రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. మీడియాతో మాట్లాడారు. భూమన మాట్లాడుతూ, పంటల సాగుకు సంబంధించి రైతుల అవసరాలకు తగినంత యూరియా ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని ధ్వజమెత్తారు. బ్లాక్‌మార్కెట్‌కు యూరియా తరలించి జనసేన, టీడీపీ నాయకులు అధిక ధరలకు విక్రయిస్తున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతును రాజు చేయడమే తన ధ్యేయమని ఆర్భాటంగా ప్రకటించిన సీఎం చంద్రబాబునాయుడుకు రైతులను నట్టేట ముంచుతూ అథోగతి పాల్జేస్తున్నారని మండిపడ్డారు. సుమారు 7లక్షల టన్నులు నిల్వ ఉంచాల్సిన యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించడంతో రైతులు పోరుబాట పట్టాల్సి వచ్చిందన్నారు. రైతులు అవసరానికి మించి యూరియాను వాడుతున్నారని, ఇలా వాడకండని కలెక్టర్ల చేత ప్రచారం చేయించడం రైతులకు పుండు మీద కారం చల్లినట్లు సీఎం చేస్తున్నారన్నారు. రైతులు తరతరాలుగా పంటల సాగు, ఎరువుల వాడకం తెలుసని, ఉద్దేశపూర్వకంగా రైతులపై ఇలా దుష్ప్రచారం చేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుంటే వైఎస్ఆర్‌సీపీ తమపై దుష్ప్రచారం చేస్తోందని టీడీపీ నాయకులు ఆడిపోసుకోవడం హాస్యాస్పదమన్నారు. సాక్షాత్తు చంద్రబాబునాయుడుకు వెన్నుదన్నుగా ఉండే ఓ పత్రిక యూరియా కొరత, దళారులు బ్లాక్‌మార్కెట్‌లో అమ్మడం గురించి కథనాలతో చాటిచెప్పిందన్నారు. కూటమి నాయకులే బ్లాక్‌మార్కెట్‌తో సొమ్ము చేసుకుంటూ రైతుల కడుపు కొడుతున్నారని విమర్శించారు. అందుకే రైతుల పక్షాన తమ పార్టీ అధిష్టానం నిరసనకు పిలుపునిచ్చిందన్నారు. సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, అన్నం పెట్టే రైతుకు వ్యవసాయానికి అవసరమైన యూరియా కూడా పంపిణీ చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు. రైతులకు అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సత్యవేడు సమన్వయకర్త రాజేష్ మాట్లాడుతూ, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇకనైనా రైతుల ఉసురు పోసుకోవడానికి బదులు వారికి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పార్లమెంట్ పరిశీలకులు ఓడూరు గిరిధర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి, బి.సుదర్శన్ రెడ్డి, సిద్ధాగుంట సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఏర్పేడు, రేణిగుంట, తొట్టంబేడు మండలాల పార్టీ అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్, గంగారి రమేష్, కోగిలి సుబ్రహ్మణ్యం, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, పగడాల రాజు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ బాషా, బీరేంద్రవర్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవి, గవర్ల కృష్ణయ్య, మణి నాయుడు, దయాకర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, అపరంజిరాజు, నిరంజన్ రెడ్డి, రమేష్, పలణి, దామోదర్ రెడ్డి, భాస్కర్ నాయుడు, హరిశ్చంద్రా రెడ్డి, చలపతి రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో రేణిగుంట వైఎస్సార్ సీపీ నాయకులు



తరలుతున్న బుచ్చినాయుడుకండ్రిగ వైఎస్ఆర్ సీపీ నాయకులు

### రైతులకు తీరని అన్యాయం

బుచ్చినాయుడుకండ్రిగ: కూటమి పాలనలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాళహస్తిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ శ్రేణులు భారీసంఖ్యలో తరలివెళ్లాయి. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిశీలకులు బీరేంద్ర వర్మ, స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, స్టేట్ ఎస్సీ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, అజయ్‌కుమార్ రెడ్డి, దేవదాసురెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటమ్మ, సముద్రాల అశోక్, వేంకటేశ్వర్లు, కిరణ్‌యాదవ్, దేవదాసురెడ్డి, సంజీవయ్య, కారణి వెంకటేష్, కత్తి సురేష్, రాజశేఖర్, బాల, చిరంజీవి, నాగూర్ పాల్గొన్నారు.

### అన్నదాత పోరు నిరసనలో రేణిగుంట నాయకులు

రేణిగుంట: శ్రీకాళహస్తిలో నిర్వహించిన అన్నదాత పోరు నిరసన కార్యక్రమంలో రేణిగుంట మండల నాయకులు సైతం పాల్గొన్నారు. ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గంగారి రమేష్, జెడ్పీటీసీ సంధ్య, , పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జువ్వల దయాకర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, మహమ్మద్ రసూల్, అబ్దుల్ ఖదీర్, రఫీ ఉల్లా, హాసన్ సాహెబ్, సర్పంచ్ నగేషం, మునిశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి, బెనర్జీ, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

తొట్టంబేడు: మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ కయ్యూరు బాల సుబ్రహ్మణ్యంను పేరెంట్స్ కమిటీ సభ్యులు సన్మానించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన నేపథ్యంలో ఆయనను సన్మానించారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ, అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్‌పర్సన్ కల్పన, వైస్ చైర్‌పర్సన్ నిర్మల, ఆయాలు మాధవి, జయరత్న, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు పద్మ, సభ్యులు మాతయ్య, ఉష, శంకర్ రెడ్డి, మోహన్ కుమార్, అశోక్, దివాకర్, వెంకటరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త మోహనరాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులకు సమాచారమివ్వాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వి.ప్రతిమ



మాట్లాడుతున్న ఎంపీపీ వి.ప్రతిమ

సత్యవేడు: మండలంలో సంక్షేమ పథకాల పంపిణీ చేపట్టే అధికారులు ముందుగా స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం అందించాలని ఎంపీపీ వి.ప్రతిమ కోరారు. మంగళవారం ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు నిర్వహించే సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమాలను స్థానిక ఎంపీటీసీలు, సర్పంచులకు సమాచారం ఇవ్వకుండానే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మండల సమావేశాలకు డుమ్మా కొడుతున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆమె కోరారు. చెరివి పంచాయతీలో రూ.50 లక్షల నిధులు దుర్వినియోగంపై కనీసం వివరణ తీసుకోకుండా విచారణ చేపట్టడం సబబేనా అంటూ ఎంపీటీసీ రామయ్య పంచాయతీ రాజ్ శాఖ అధికారులను నిలదీశారు. విచారణ నేపథ్యంలో తనకు సమాచారం ఇవ్వకుండా, నోటీసు ఇచ్చి ఏకపక్షంగా విచారణ చేయడంపై మండిపడ్డారు. దీనిపై ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ మునిరవికుమార్‌ను నిలదీశారు. ఏఓ త్రివిక్రమరావు, వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, ఏపీఓ విజయభాస్కర్, ఉపాధి ఏపీఓ భాస్కర్, ఆర్ఐ సురేష్, సీనియర్ అసిస్టెంట్ హేమభూషణం, ఎంపీటీసీలు బాలసుందరంరెడ్డి, బాలయ్య, సవనన్, సెల్వి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ శక్తిగా సీపీఎం



మాట్లాడుతున్న కందారపు మురళి

తొట్టంబేడు: దేశంలో ప్రజా స్వాతంత్ర్యాన్ని కాపాడే అసలైన అతిపెద్ద రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా సీపీఎం ఆవిర్భవించనుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో మంగళవారం సీపీఎం జిల్లా స్థాయి ముఖ్య కార్యదర్శుల సమావేశం నిర్వహించారు.. పార్టీ బలోపేతంపై కార్యదర్శులకు మురళి దిశా నిర్దేశం చేశారు. సీపీఎం జిల్లా నేతలు అంగేరి పుల్లయ్య, జి.బాలసుబ్రమణ్యం, గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

### మైక్రోబయాలజీలో వాసవికి డాక్టరేట్



వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు పురుషోత్తం కుమార్తె కాపులూరు వాసవి ఎస్వీయూ మైక్రోబయాలజీ విభాగంలో పరిశోధక విద్యార్థిని. ఆమె జంతుశాస్త్ర విభాగానికి చెందిన ఆచార్యులు ప్రొఫెసర్ మారం రాజశేఖర్ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించినట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజామాణిక్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ఎంపీటీసీల నిరసన



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీలు

సత్యవేడు: తమకు అందాల్సిన గౌరవ వేతనం బకాయిల సొమ్ము విడుదల చేయాలంటూ సత్యవేడు మండలంలోని ఎంపీటీసీలు నిరసన చేపట్టారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీటీసీలు నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకొన్న ఎంపీపీ వి.ప్రతిమ, ఎంపీడీఓ చంద్రశేఖర్, పరిపాలన అధికారి త్రివిక్రమరావు సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఇంకా 17 నెలల గౌరవ వేతనం బకాయి ఉందన్నారు. ప్రస్తుతం ఐదు నెలలకు వేతనాలు సర్దుబాటు చేస్తామని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలపగా ఎంపీటీసీలు తిరస్కరించారు. సమాచారాన్ని జిల్లా అధికారులకు తెలియజేసి పూర్తి స్థాయిలో అందిస్తామని అధికారులు తెలిపారు.

### నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

వరదయ్యపాళెం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 1.4.2024 నుండి 31.3.2025 వరకు చేసిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

కేవీబీపురం: టీచర్స్‌డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నవారికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మూర్తి రమేష్, ప్రధాన కార్యదర్శి గురునాథం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్న వారిని కొనియాడారు. కేవీబీపురంలో ఎంఈఓగా పనిచేసిన భాస్కర్ బాబు, ఉపాధ్యాయులు బాబు, రాజాలాల్, కేజీబీవీ పీఈటీ సతీ సావిత్రిలను వారు శాలువాలు, గజమాలలతో సన్మానించారు. సీనియర్ ఉపాధ్యాయుడు గజేంద్రయ్య, భాస్కర్, కేవీబీపురం ఎంఈఓ రవి కుమార్, వెంకట కృష్ణయ్య, మధు, మురళీ, చంద్రారెడ్డి, రవి, ఎల్లప్పరెడ్డి పాల్గొన్నారు.

## బ్రెయిన్ డెడ్.పంచాయతీ కార్యదర్శి అవయవదానం

తొట్టంబేడు: మండలంలోని పెద్ద కనపర్తి పంచాయతీ సెక్రటరీ పైపురి విజయలక్ష్మి(35) బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. దీంతో ఆమె అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు. విజయలక్ష్మి 2014 నుంచి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం తీవ్రమైన తలనొప్పి రావడంతో చెన్నై అపోలోకి తీసుకెళ్లారు. అక్కడ బ్రెయిన్ స్ట్రోక్ అని నిర్ధారించి ఆపరేషన్ చేశారు. అనంతరం అక్కడ నుంచి శ్రీకాళహస్తి ఎంజీ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. ఇక్కడి వైద్యులు ఆమె బతకడం కష్టమని, బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యారని చెప్పారు. దీంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. అవయవదానం గురించి అవగాహన కల్పించడంతో అంతటి బాధలోనూ అంగీకరించారు. విజయలక్ష్మికి ఇద్దరు కుమారులు, ఆమె భర్త పుత్తేరిలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. కాగా ఆస్పత్రిలో ఉన్నవారిని ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు పరామర్శించారు.

### ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి: మండలంలోని ఇనగలూరు వద్ద గత నెల 26న ప్రమాదంలో గాయపడిన ఆత్మకూరుకు చెందిన అహ్మద్ మంగళవారం మృతి చెందాడు. సొంత పనుల నిమిత్తం ఆత్మకూరు నుంచి శ్రీకాళహస్తికి వస్తున్న అహ్మద్ ఇనగలూరు వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రేణిగుంట వద్ద గల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆలయ గేటు వద్ద యాచకురాలు మృతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని నాల్గో గేటు వద్ద గుర్తుతెలియని యాచకురాలు మంగళవారం రాత్రి మృతిచెందింది. గత కొంతకాలంగా ఆలయ పీఆర్వో కార్యాలయ సమీపంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆ వృద్ధురాలు.. ఎవరూ పట్టించుకోకపోవడంతో మృతిచెందినట్టు సమాచారం. ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.



విశేష అలంకరణలో కట్ట పుట్టాలమ్మ

తొలి హారతి ఇస్తున్న ఆలయ ధర్మకర్తలు



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు



## వైభవంగా కట్ట పుట్టాలమ్మ జాతర

మండలంలో కరకంబాడిలోని శ్రీ కట్ట పుట్టాలమ్మ ఆలయంలో రెండ్రోజుల జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి శోభాయమానంగా అలంకరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కురకాల్వ రామచంద్రయ్య, కురకాల్వ వాసు తొలి పూజలు చేసి జాతర సంబరాలను ప్రారంభించారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో వివిధ పుష్పాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి, మొక్కులు చెల్లించారు. ఆలయ అభివృద్ధి కమిటీ జాతరకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసింది. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. - రేణిగుంట



విద్యుత్ వెలుగుల్లో సరికొత్త శోభ సంతరించుకున్న ఆలయం